సాక్షి ఖమ్మం

మంగళవారం । 4 । జూలై । 2023



మాకే అవకాశం ఇస్తే...

గిరిజన విద్యాసంస్థల్లో ఏఎన్ఎంలుగా కొత్త వారికి కాకుండా గతంలో పనిచేసిన వారికే అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. 8లో



పోడు'పై చిత్తశుద్ధి లేదు..

అర్హులందరికీ పోడు పట్టాలు ఇవ్వడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి రంగారావు ఆరోపించారు. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 25°

వాతావరణం

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమై కొన్నిచోట్ల వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

కనకదుర్గ ఆలయంలో భట్టి పూజలు



పూజలో పాల్గొన్న భట్టి దంపతులు

మధిర: ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న కనకదుర్గమ్మ తల్లికి సీఎల్పీ నేత, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క – నందిని దంపతులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణలో ఆయన చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్రను విజయవంతంగా పూర్తయిన సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భట్టి దంపతులకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పూజలు చేయించారు. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, నాయకులు వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కోనా ధనికుమార్, మేడా సురేష్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఆర్వో శిరీష

ఖమ్మం సహకారనగర్: ప్రజలు వెల్లడించే సమస్యల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి శిరీష సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి(గ్రీవెన్స్ డే)లో భాగంగా డీఆర్డీఓ విద్యాచందనతో కలిసి ఆమె ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమావేశమై ఫిర్యాదులు పరిష్కరించేలా సూచనలు చేశారు.పాల్గొన్నారు.

హాస్టళ్ల విద్యార్థులకు నోట్ బుక్కులు, సామగ్రి



జిల్లాకు చేరిన నోట్‌బుక్స్‌తో డీడీ, ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ సంక్షేమ శాఖ వసతిగృహాల్లోని విద్యార్థులకు కావాల్సిన నోట్ పుస్తకాలు, ఇతర సామగ్రి జిల్లాకు చేరుకుంది. విద్యార్థులకు అందించే నోట్ పుస్తకాలతో పాటు బెడ్ షీట్లు, బ్లాంకెట్లు జిల్లా చేరగా డివిజన్ల వారీగా అధికారులకు ఎస్సీ డీడీ సత్యనారాయణ సోమవారం అందజేశారు. రెండు రోజుల్లో అన్ని వసతిగృహాల్లో విద్యార్థులకు అందేలా చూడాలని వార్డెన్లకు సూచించారు. ఏఎస్‌డబ్ల్యూఓలు, వసతిగృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

మైనార్టీ అభ్యర్థులకు యూపీఎస్సీ శిక్షణ

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన యూపీఎస్సీ–సీశాట్ పరీక్ష కోసం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఎం.ఏ.మహమూదీ తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన వారు ఈనెల 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకుంటే 23న జరిగే అర్హత పరీక్ష ఆధారంగా శిక్షణకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఆసక్తి కలిగన వారు https://cet.ceg.gov.in /tnreis/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవడంతో పాటు సమాచారం కోసం 08742–293565 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు

గత ఏడాది, ఈ ఏడాది జూలై 1 నాటికి ప్రధాన పంటల సాగు వివరాలు (ఎకరాల్లో)

పంట	గత ఏడాది	ఈ ఏడాది
వరి నారు	25,550	20,051
వరి సాగు	5,155	2,852
పత్తి	95,145	50,658
కంది	305	--
మొక్కజొన్న	214	50
పెసర	1,439	1,160
పచ్చిరొట్ట ఎరువుల సాగు		
జీలుగు	43,566	21,513
పిల్లి పెసర	2,041	591
జనుము	819	1,083
మొత్తం	46,426	23,187

నెమ్మదిగా సాగుతోంది..!

వానలు లేక చతికిలబడిన వ్యవసాయం
- గత ఏడాదితో పోలిస్తే తక్కువ ఎకరాల్లోనే పంటలు
- నామమాత్రంగానే పత్తి, అపరాల సాగు
- వరి, మిర్చిపైనే రైతుల ఆశలు

ఖమ్మంవ్యవసాయం: ఆశించిన స్థాయిలో వానలు కురవకపోవటంతో జిల్లాలో పంటల సాగు నెమ్మదించింది. విత్తనాలు వేయడానికి కనీసం 60 మి.మీల వర్షపాతం ఉండాల్సి ఉంటే జూన్ మొత్తం కూడా ఆ స్థాయిలో వర్షపాతం నమోదుకాలేదు. జూన్ నెల సాధారణ వర్షపాతం 105.2 మి.మీలు కాగా గత ఏడాది సాధారణానికి మించి 121 మి.మీ.లుగా నమోదైంది. కానీ ఈసారి కేవలం 49.5 మి.మీ.ల వర్షపాతం మాత్రమే నమోదు కావడంతో పంటల సాగు ముందుకు కదలడం లేదు. ఈ ఏడాది జిల్లాలో అన్ని పంటల సాగు లక్ష్యం 6.50 లక్షల ఎకరాలుగా వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేసి.. ప్రధానంగా వరి, పత్తి, మిర్చి పంటలు భారీగా సాగవుతాయని భావించారు.

రుతుపవనాలు ఆలస్యం.. మళ్లీ వెనక్కి

సాధారణంగా తొలకరి మే చివరి వారం లేదా జూన్ మొదటి వారంలో పలకరిస్తుంది. దీంతో రైతులు పత్తి గింజలను నాటడమే కాక మెట్ట భూముల్లో అపరాల పంటలు సాగు చేస్తారు. మిరప వంటి పంటలను సాగు చేసే భూముల్లో, మాగాణి భూముల్లో పెసర పంట వేస్తారు. జూన్ రెండోవారం వరకు వర్షాధారంగా అపరాల పంటలైన పెసర విత్తుకుని.. జూన్ నెలాఖరు వరకు పత్తి గింజలు వేస్తారు. కానీ ఈ ఏడాది జూన్ మూడో వారం ఆరంభం వరకు కూడా చినుకు పడలేదు. మూడోవారంలో రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించినా రైతులు ఆశించిన విధంగా కాకుండా సాధారణ స్థాయిలో కూడా వర్షాలు కురవడం లేదు. అడపాదడపా జల్లులే తప్ప ఇప్పటివరకు భారీ వర్షం కురిసిన దాఖలాలే లేవు. ఫలితంగా పత్తితో పాటు మెట్ట పైర్లు, అపరాల పంటల సాగు ముందుకు సాగలేదు. వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు, అధికారులు జూలై రెండో వారం వరకు పత్తి, అపరాల పంటలు సాగు చేసుకోవచ్చని చెబుతున్నా.. రైతులకు మాత్రం ఆయా పంటలపై ఆశలు సన్నగిల్లాయి.

వరి, మిరప పంటలపై ఆశలు

ఆలస్యంగానైనా వర్షాలు కురిస్తే వరి, మిరప వంటి పంటలను సాగు చేయాలని రైతులు ఆశగా ఉన్నారు. వానలు అనుకూలిస్తే దాదాపు 2.80 లక్షల ఎకరాలకు పైగా వరి, 80 వేల ఎకరాలకు పైగా మిర్చి పంటలు సాగయ్యే అవకాశం ఉంది. ఈ ఏడాది మిర్చికి మంచి ధర పలకటంతో రైతులు ఆ పంట సాగుకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

గణనీయంగా తగ్గిన సాగు

గత ఏడాది మే చివరి వారం నుంచే వర్షాలు మొదలుకాగా, పంటల సాగు ఊపందుకుంది. ఈ ఏడాది కూడా వర్షాలు కురుస్తాయనే ఆశతో పొడి దుక్కుల్లో పత్తి గింజలు వేయగా.. నేలలోనే ఎండిపోయాయి. ఈ ఏడాది పత్తికి ధర లేకపోవటం, వర్షాలు అనుకూలించకపోవటంతో పంట సాగు లక్ష్యం ప్రశ్నార్థకంగా మారే అవకాశం కనిపిస్తోంది. ఇక వానలు అనుకూలించక మాగాణి భూముల్లో ఆశించిన మేరకు రైతులు పచ్చిరొట్ట ఎరువు కూడా వేసుకోలేకపోయారు. వరి నార్లకు సైతం ఆలస్యమవుతుంది. ఈ నేపథ్యాన వ్యవసాయ శాఖ మధ్య కాలిక, స్వల్ప కాలిక రకాలను వేసుకోవాలని రైతులకు సూచనలు చేస్తోంది. గత ఏడాది జూలై 1వ తేదీ నాటికి 1,28,003 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేయగా, ఈ ఏడాది కేవలం 75,123 ఎకరాల్లో మాత్రమే పంటలు వేశారు. అయితే వర్షాభావంతో పత్తి గింజలు మొలకెత్తకపోగా.. అక్కడక్కడా మొలకెత్తినా ఎండకు మాడిపోతున్నాయి. ఇక అపరాల పంటలైన పెసర, మినుము పంటల పరిస్థితి కూడా అలాగే ఉంది.

నీరు లేని పాలేరు...



రిజర్వాయర్‌లో తేలిన ఇసుక మేటలు (ఇన్‌సెట్) కనిష్ట స్థాయికి పడిపోయిన నీటిమట్టం

- అడుగంటుతున్న రిజర్వాయర్
- 12 అడుగులకు పడిపోయిన నీటిమట్టం
- గోదావరి జలాలు వస్తేనే ఫలితం

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం 12 అడుగులకు పడిపోయింది. జూలై మొదటి వారం వచ్చినా వర్షాలు లేకపోవడంతో నానాటికీ రిజర్వాయర్‌లో నీరు తగ్గి ఇసుక మేటలు తేలుతున్నాయి. వర్షాలు లేకపోగా, సాగర్ జలాల విడుదలకు అవకాశం లేకపోవడంతో నీటిమట్టం మరింత తగ్గే అవకాశముందని చెబుతున్నారు.

తాగునీటికి 12.60క్యూసెక్కులు

పాలేరు రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు. అయితే, వర్షాభావ పరిస్థితుల్లో నీటిమట్టం రోజురోజుకు తగ్గుతూ 12 అడుగులకు చేరింది. వివిధ ప్రాంతాల్లో తాగునీటి అవసరాల కోసం రిజర్వాయర్ నుండి మిషన్ భగీరథ ప్రాజెక్టులకు రోజుకు 12.60 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. ప్రస్తుతం 1.037 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. వర్షాలు రాకపోతే రిజర్వాయర్ డెడ్ స్టోరేజీకి చేరే అవకాశముంది. తద్వారా తాగునీటి పథకాలకు నీరు విడుదల చేయడం సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారు.

గోదావరి జలాలు చేర్చేలా చర్యలు

రిజర్వాయర్‌కు సాగర్ జలాలే ప్రధాన వనరు. కానీ ప్రస్తుతం సాగర్ డ్యాంలోనూ తగినంత నీరు లేకపోవడం, కాల్వల మరమ్మతులు జరుగుతుండడంతో నీరు విడుదల చేసే అవకాశం లేదు. దీంతో జల వనరుల శాఖ అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బయ్యన్న వాగు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ అలుగు పారించటం ద్వారా నీరు పాలేరు వాగులోకి.. ఆపై సూర్యాపేట జిల్లా ఉర్లుగొండ వద్ద రిజర్వాయర్‌లో కలుస్తుంది. దీంతో పాలేరు రిజర్వాయర్‌లో నీటిమట్టం పెరుగుతుందనే భావనకు వచ్చారు. అంతేకాకుండా వరంగల్ జిల్లాలోని ఎస్సారెస్పీ ఫేజ్–2 మెయిన్ కెనాల్ 324 కి.మీ. వద్ద మాటేడు చెరువు నుండి డీబీఎం 60 కాల్వల ద్వారా కూడా పాలేరుకు నీటిని చేర్చాలని నిర్ణయించారు. ఈమేరకు పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విన్నవించడంతో గోదావరి జలాలను పాలేరుకు తరలించాలని ఆదేశించారని సమాచారం. దీంతో కొద్దిరోజుల్లో పాలేరు రిజర్వాయర్‌కు గోదావరి జలాలు చేరనుండగా.. సాగర్ నీరు రాకున్నా సమస్య ఉండదని అధికారులు తెలిపారు.

దరఖాస్తులు 'బుట్ట'దాఖలు చేశారని...

కారేపల్లి: ప్రభుత్వం బీసీల్లోని చేతి, కులవృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేయనున్నట్లు ప్రకటించి దరఖాస్తులు స్వీకరించింది. ప్రస్తుతం దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది. అయితే, మండలంలోని మేదర కులవృత్తిదారులు దరఖాస్తు చేసుకోగా అధికారులు తాము కుల వృత్తి చేయడం లేదనే నెపంతో తిరస్కరించారని మేదర సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు. ఈమేరకు సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వారు సామగ్రితో సహా బైఠాయించి తట్టలు, బుట్టలు అల్లుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఎంపీడీఓ చంద్రశేఖర్ కావాలనే తమపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించకుండానే కార్యాలయంలో కూర్చుని చాలా మంది దరఖాస్తులను తిరస్కరించారని పేర్కొన్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం పోడుపట్టాలు పంపిణీ చేసేందుకు కారేపల్లి వచ్చిన ఎమ్మెల్యే రాములునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. నిరసనలో మేదర సంఘం జిల్లా అధ్యక్షుడు వాసం నాగేశ్వరరావుతోపాటు అంకాలు శ్రీనివాసరావు, పిల్లి వెంకటేశ్వర్లు, పోతు రాములు, పోతు శ్రీరాములు, కోనం వెంకటేశ్వర్లు, ఎనమలగండ్ల రవి, కనికారపు వెంకటేశ్వర్లు, చింత సుజాత, పోతు రవి, రఘు, రామయ్య, కె.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



బుట్టలు అల్లుతున్న మేదర కులవృత్తిదారులు

కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మరు..

- బీఆర్ఎస్ పార్టీ బలహీన వర్గాలకు 'ఏ' టీం
- పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు, పక్కన నాయకులు

ఖమ్మం వైరారోడ్: కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి ఘోర పరాభావం తప్పదని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజకీయ పబ్బం గడుపుకునేందుకు ఆ పార్టీ నేతలు ఖమ్మంలో జరిగిన సభలో అవాస్తవాలు మాట్లాడారని ఆరోపించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలోని గిరిజన, ఆదివాసీలకు ఇటీవలే పోడు పట్టాలు పంపిణీ చేయగా, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పోడు హక్కులు కల్పిస్తామని చెప్పడం గర్హనీయమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఇతర పార్టీలకు బీ టీమ్‌గా ఉండదని.. బడుగు, బలహీన, అణగారిన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించే 'ఏ' టీమ్ మాత్రమేనని తెలిపారు. గుజరాత్ ఎన్నికల సమయంలో రాహుల్‌గాంధీ ఆ రాష్ట్రానికి కాకుండా మధ్యప్రదేశ్‌కు వెళ్లడంతోనే బీజేపీకి సహకరించినట్లు అర్థమైందని చెప్పారు. కాగా, ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఏకవచనంతో సంబోధించడం సరికాదని పేర్కొన్నారు. ఇక పీపీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలలు కల్లలు కావడం ఖాయమని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘనవిజయం సాధించాక డిసెంబర్‌లో విజయోత్సవ సభ ఖమ్మంలోనే నిర్వహిస్తామని మధు వెల్లడించారు. ఈసమావేశంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వర్లుతో పాటు చింతనిప్పు కృష్ణచైతన్య, కమర్తపు మురళి, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, అసిస్టెంట్ ప్రోగ్రామర్ నియామకానికి సంబంధించి సోమవారం అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని రిక్కాబజార్ పాఠశాలలో పరిశీలన చేపట్టగా ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకున్న 36మందికి గాను 27మంది హాజరయ్యారని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ఈ మేరకు అధికారులు రామకృష్ణ, రాజశేఖర్, హెచ్ఎంలు అజిత, శివకుమారి, జీ.ఎస్.ప్రసాదరావు తదితరులు అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు.

పట్టాల పంపిణీ త్వరగా పూర్తి చేయండి

వీసీలో ఆదేశించిన సీఎస్

ఖమ్మం సహకారనగర్: పోడు భూముల పట్టా పంపిణీని నాలుగు రోజుల్లో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. హైదరాబాద్ నుండి సోమవారం తెలంగాణకు హరితహారం, గృహలక్ష్మి, బీసీల్లో చేతి, కులవృత్తుల వారికి ఆర్థిక సాయం, గొర్రెల పంపిణీ, పోడుపట్టాల పంపిణీపై వీసీ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ పోడు సాగుదారులకు పట్టాల పంపిణీలో వేగం పెంచాలని చెప్పారు. ఇంకా ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో 3వేల చొప్పున గృహలక్ష్మి పథకం కింద లబ్ధిదారులను ఎంపిక చేయాలని తెలిపారు. అలాగే, ఎరువులు, విత్తనాల కొరత రాకుండా చూడాలని, ధరణిలో నూతన పట్టాదారుల బ్యాంకు వివరాలు అప్‌డేట్ చేయాలని, హరితహారం ద్వారా మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు సిద్ధం చేయాలని సూచించారు. అలాగే, బీసీల్లో చేతి, కులవృత్తుల వారు రూ.లక్ష ఆర్థిక సాయం కోసం చేసుకున్న దరఖాస్తు పరిశీలన త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. ఈ వీసీకి హైదరాబాద్ సచివాలయం నుంచి కలెక్టర్ గౌతమ్ హాజరుకాగా, జిల్లా నుంచి అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎన్.మధుసూదన్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్‌సురభి, డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

దమ్మక్కకు స్మృత్యంజలి

- గిరిజనుల ఆధ్వర్యంలో వైభవంగా సేవాయాత్ర
- అలరించిన నగర సంకీర్తన
- రామయ్యకు పూలు, పండ్లు సమర్పించిన ఆదివాసీలు
- ఘనంగా గోవిందరాజస్వామి కల్యాణం





రామయ్యకు పూలు, పండ్లు సమర్పిస్తున్న గిరిజనులు (ఇన్‌సెట్) గిరిజనులకు పండ్లు, వస్త్రాలు అందజేస్తున్న ఈఓ

భద్రాచలం: భద్రగిరి క్షేత్రంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని పూజించిన ఆద్యురాలు, రామయ్యకు అపర భక్తురాలు అయిన పోకల దమ్మక్క సేవా యాత్ర ఘనంగా నిర్వహించారు. ఆషాఢ పౌర్ణమి రోజున భద్రాచలం పుణ్యక్షేత్రంలో పోకల దమ్మక్కను స్మరిస్తూ గిరిజనుల ఆధ్వర్యంలో ఈ యాత్ర నిర్వహించటం 2014 నుంచి ఆనవాయితీగా వస్తోంది. సోమవారం ఆషాఢ పూర్ణిమ కావడంతో వివిధ గ్రామాల నుంచి గిరిజనులను ప్రత్యేక బస్సుల్లో భద్రగిరికి తీసుకొచ్చారు. ఉత్సవంలో భాగంగా ఆలయ ప్రాంగణంలోని పొగడ చెట్టు వద్ద గల దమ్మక్క విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, కోలాటాలు, గిరిజనుల సంప్రదాయ నృత్యాల నడుమ చప్టా దిగువన ఉన్న భక్త రామదాసు విగ్రహం వద్ద, సీతారామ ఆఫీసర్స్ క్లబ్ వద్ద ఉన్న శబరి విగ్రహం వద్ద అర్చకులు పూజలు నిర్వహించి, పూలు, పండ్లు సమర్పించారు. రామదాసు కీర్తనలతో నగర సంకీర్తన చేశారు. అనంతరం దేవస్థానంలో రామయ్యకు దమ్మక్క తరఫున పలు రకాల పూలు, ఫలాలను వివిధ గ్రామాల నుంచి తీసుకొచ్చిన గిరిజనులు అందజేశారు. ఈ సందర్భంగా రామయ్యకు ప్రత్యేక పూజలు, నిత్యకల్యాణ వేడుకలను వైభవోపేతంగా జరిపారు.

రామయ్యకు అపర భక్తురాలు..

శ్రీరాముడికి దమ్మక్క అపర భక్తురాలని దేవస్థానం ఈఓ రమాదేవి అన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆమె మాట్లాడుతూ.. అలాంటి దమ్మక్కను స్మరించుకోవడం, సేవా యాత్ర నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. గిరిజనులను ఈ సేవాయాత్రలో భాగస్వాములను చేయడం కనీస ధర్మమని, అందుకే వివిధ గ్రామాల నుంచి గిరిజనులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సుల ద్వారా తరలించామని తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన కళాకారులు ప్రదర్శించిన సంప్రదాయ రేలా, కొమ్ము నృత్యాలు అందరినీ అలరించాయి. ఈ పూజల్లో ఆలయ ప్రధానార్చకులు అమరవాది విజయరాఘవన్, అర్చకులు, వేదపండితులు, సీసీ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయంగా గోవిందరాజ స్వామి కల్యాణం

శ్రీసీతారామచంద్రస్వామి వారి అనుబంధ ఆలయమైన తాతగుడి సెంటర్‌లో వేంచేసియున్న గోవిందరాజ స్వామి వారి తిరుకల్యాణోత్సవం సోమవారం వైభవోపేతంగా జరిగింది. శ్రీదేవి – భూదేవి సమేత గోవిందరాజ స్వామి వారికి దేవస్థానం తరఫున ఈఓ రమాదేవి ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అర్చకులు కల్యాణోత్సవ తంతును శాస్త్రోక్తంగా నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కాగా, అంతకుముందు ఆలయ ప్రాంగణంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుకను వైభవోపేతంగా జరిపించారు. స్వామివారి మూలమూర్తులను ముత్తంగి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామివారికి కంకణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్ర ధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారి నిత్యకల్యాణంలో సైతం గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

సీఎం కేసీఆర్‌కు నవధాన్యాల చిత్రం!

తెలంగాణ దశాబ్ది వేడుకల్లో భాగంగా రైతు దినోత్సవం సందర్భంగా సత్తుపల్లికి చెందిన చిత్రకారుడు గోడ్డిటి బాలకృష్ణ, ఆయన కుమార్తె సాయి శ్రీతో పాటు సౌమ్య, సౌజన్య నవధాన్యాలతో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రాలను రూపొందించారు. ఈమేరకకు సోమవారం హైదరాబాద్‌లో ఆయా చిత్రాలను కేసీఆర్, కేటీఆర్‌కు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆధ్వర్యాన అందజేశారు. మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, పెనుబల్లి జెడ్పీటీసీ సభ్యుడు చెక్కిలాల మోహన్‌రావు ఉన్నారు. –సత్తుపల్లి



నవధాన్యాల చిత్రపటంతో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే తదితరులు

క్లుప్తంగా

రైతుల సంక్షేమానికి పాటుపడాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్

మధిర: మార్కెట్ పాలకవర్గం రైతుల సంక్షేమానికి పాటుపడాలని వక్తలు సూచించారు. మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం సోమవారం బాధ్యతలు చేపట్టింది. స్థానిక మార్కెట్ యార్డులో జరిగిన సమావేశంలో చైర్మన్‌గా బంధం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌గా కటికల వెంకట సత్యనారాయణరెడ్డి తోపాటు డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో మార్కెట్ కార్యదర్శి సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేయించగా ఎమ్మెల్సీ తాత మధుసూదన్, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు మాట్లాడారు. రైతు సంక్షేమమే కృషి చేస్తున్న ప్రభుత్వ లక్ష్యానికి ధ్యేయానికి అనుగుణంగా పాలకవర్గం పనిచేయాలని సూచించారు. తొలుత ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత, ఎంపీపీ లలిత తదితరులుపాల్గొన్నారు.

అన్యాయం జరిగిన చోటకు హనుమంతు!

మాజీ ఎంపీ వీహెచ్



మాట్లాడుతున్న వీహెచ్, పక్కన దుర్గాప్రసాద్

ఖమ్మం సహకారనగర్: అన్యాయం ఎక్కడ జరిగితే అక్కడి బాధితులకు అండగా హనుమంతరావు నిలుస్తాడని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ వి.హన్మంతరావు తెలిపారు. ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. ధరణి పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం వేల ఎకరాల భూములను పెద్దలకు కట్టబెట్టిందని ఆరోపించారు. నాడు ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు భూమి పేదలకు పంపిణీ చేస్తే నేటి ప్రభుత్వం లాక్కుంటోందని మండిపడ్డారు. కాగా, కీసర ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో పేద రైతులకు జరుగుతున్న అన్యాయంపై పోరాడుతామని తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పార్టీ శ్రేణులు, అభిమానులు తెలంగాణ గర్జన సభకు రాకుండా పాలకులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజలు ఛేదించుకుని వచ్చారని చెప్పారు. ఈమేరకు సభ విజయవంతానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, నాయకులు హుస్సేన్ పాల్గొన్నారు.

రాహుల్‌పై విమర్శలు సరికాదు..

ఖమ్మం సహకారనగర్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీపై బీఆర్ఎస్ మంత్రులు, నేతలు విమర్శలు చేయడం సరికాదని కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖమ్మంలో సభ విజయవంతం కావడంతో తట్టుకోలేని మంత్రులు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రాహుల్‌గాంధీ చెప్పినట్లుగా బీజేపీకి బీఆర్ఎస్ బీ టీమ్ అని తెలిపారు. ఏదిఏమైనా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అన్ని సీట్లు తాము గెలుచుకుంటామని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

ఉచితంగా విత్తనాలు అందించాలి

తల్లాడ: వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యాన రైతులకు విత్తనాలను ప్రభుత్వమే ఉచితంగా అందించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు నున్నా నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. తల్లాడలో సోమవారం జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. అదును దాటుతున్నా వర్షాలు కురవకపోవడంతో ఇప్పటికే నాటిన విత్తనాలు మొలకెత్తలేదని తెలిపారు. ఈమేరకు రైతులకు ఉచితంగా విత్తనాలు అందించాలన్నారు. నాయకులు తాతా భాస్కర్ రావు, బండి రమేష్, మాదినేని రమేష్ వాసిరెడ్డి ప్రసాద్, నాగేశ్వర్‌రావు, బిక్కసాని గంగాధర్, శీలం ఫకీరమ్మ, రచ్చ నరసింహారావు, వనమా చిన్న సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాకే అవకాశం ఇస్తే బాగుండు!

- గిరిజనశాఖ హాస్టళ్లు, పాఠశాలల్లో ఏఎన్ఎం పోస్టులకు నోటిఫికేషన్
- గతంలో విధులు నిర్వర్తించిన వారిని కొనసాగించని వైనం
- కరోనా సమయంలో పనిచేసినందున తమనే తీసుకోవాలని వినతి
- మళ్లీ దరఖాస్తు చేసుకుంటే వెయిటేజీ ఇస్తామని ప్రకటన

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలలు, ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ వసతిగృహాల్లో ఏఎన్ఎంల నియామకానికి శాఖ ఉన్నతాధికారులు కసరత్తు మొదలుపెట్టారు. ఔట్‌సోర్సింగ్ విధానంలో ఏఎన్ఎంల నియామకానికి ప్రభుత్వం అవకాశం కల్పించడంతో జిల్లాలో అర్హుల నుండి దరఖాస్తులను ఆహ్వానించారు. అయితే, గతంలో ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో ఏఎన్ఎంలు విధులు నిర్వర్తించాన గతేడాది వారిని కొనసాగించలేదు. మళ్లీ ఇప్పుడు అవకాశం ఉన్నా తమనే తీసుకోకుండా దరఖాస్తులు ఆహ్వానించడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఎవరూ ముందుకు రాని సమయంలో విధులు నిర్వర్తించిన తమకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను కోరినట్లు సమాచారం.

కరోనా సమయంలోనూ విధులు

ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో ఏఎన్ఎంలుగా 2018 ఆగస్టులో అధికారులు కాల్ హెల్త్ నుండి 30 మందిని ఎంపిక చేశారు. వీరికి 4 గంటల పని విధానంతో నెలకు రూ.4 వేల వేతనం అందించారు. అయితే తక్కువ వేతనం అందినా కరోనా సమయంలోనూ విధులు నిర్వర్తించారు. అయితే తాజాగా శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఈ ఏడాది ఔట్‌సోర్సింగ్ విధానంలో ఏఎన్ఎంలకు ఏజెన్సీ ద్వారా రూ.22,750 వేతనం ఇవ్వనున్నట్లు ప్రకటించింది. నాలుగేళ్ల పాటు అతి తక్కువ వేతనంతో విధులు నిర్వర్తించిన తమకే అవకాశం కల్పించాలనే డిమాండ్ వారి నుంచి వస్తోందని అధికారులు చెబుతున్నారు.



జిల్లాలో 29 పోస్టులు..

జిల్లాలో గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యాన ఆశ్రమ పాఠశాలలు, ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ వసతిగృహాలు కొనసాగుతున్నాయి. నిర్వహిస్తున్నారు. గతంలో ఇవి 30 ఉండగా.. కారేపల్లి పోస్ట్ మెట్రిక్ వసతిగృహంలో విద్యార్థులు లేరని ఎత్తివేశారు. ఇక పది ఆశ్రమ పాఠశాలలు, ఎనిమిది ప్రీ మెట్రిక్ వసతిగృహాలు, 11 పోస్ట్ మెట్రిక్ వసతిగృహాలు ఉండగా.. వీటిలో ఏఎన్ఎంలను ఔట్ సోర్సింగ్ విధానంలో నియమిస్తారు. ఇందుకోసం 18 నుండి 44 ఏళ్ల వయస్సు కలిగి, పదో తరగతి, ఇంటర్ ఉత్తీర్ణత, గుర్తింపు పొందిన సంస్థలో 18 నెలల ఏఎన్ఎం శిక్షణ పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అయితే, గతంలో పనిచేసిన వారినే నేరుగా తీసుకోవాలనే డిమాండ్ వస్తుండడంతో అధికారులు గిరిజన విద్యా సంస్థల్లో గతంలో పనిచేసిన వారికి 20 శాతం వెయిటేజ్(ఏడాదికి 5 శాతం చొప్పున) ఇస్తామని ప్రకటించారు.

దరఖాస్తులు ఇలా..

గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో ఏఎన్ఎం పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారు టీఎస్ ఓటీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ఈనెల 7 నుండి 13వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనుండగా, 15న పరిశీలించి కలెక్టర్‌కు పంపిస్తారు. జిల్లా ఎంపికల కమిటీ 20వ తేదీ లోపు ఏఎన్ఎంలను ఎంపిక చేసి, జాబితా ప్రకటిస్తుంది. ఎంపికైన ఏఎన్ఎంలు కేటాయించిన పాఠశాలలు, వసతిగృహాల్లో 22వ తేదీన రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

నిబంధనల ప్రకారమే పోస్టుల భర్తీ



2023–24 సంవత్సరంలో ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో ఏఎన్ఎం పోస్టుల భర్తీకి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నోటిఫికేషన్ విడుదల చేశాం. గతంలో నాలుగేళ్లు పనిచేసిన వారికి 20 శాతం వెయిటేజీ ఇస్తామని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. నిబంధనల ప్రకారమే ఏఎన్ఎం ఎంపిక ఉంటుంది.

– కృష్ణానాయక్, డీటీడీడీ, ఖమ్మం

‘నీట్’లో న్యూవిజన్‌కు ర్యాంకుల పంట



విద్యార్థులను చైర్మన్ సీహెచ్‌జీకే.ప్రసాద్ తదితరులు

ఖమ్మంసహకారనగర్: నీట్ ఫలితాలకు సంబంధించి రాష్ట్ర స్థాయి ర్యాంకులను ప్రకటించారు. ఈమేరకు తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని న్యూవిజన్ విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్‌జీకే.ప్రసాద్ తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను అభినందించాక ఆయన మాట్లాడారు. రాష్ట్ర స్థాయి ఓపెన్ కేటగిరీలో తమ విద్యార్థి బి.ధనుష్ 26వ ర్యాంకు సాధించాడని తెలిపారు. తమ కళాశాల నుండి 142 మంది విద్యార్థులు నీట్‌కు హాజరు కాగా ఏ, బీ కేటగిరీల్లో 97 శాతం మంది మెడికల్ సీట్లకు అర్హత సాధించారన్నారు. అనంతరం అకడమిక్ డైరెక్టర్లు కార్తీక్, గోపీచంద్ మాట్లాడగా ప్రిన్సిపాల్ బ్రహ్మచారి, శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

● డాక్టర్స్ మెడికల్ అకాడమీ సత్తా

డాక్టర్స్ మెడికల్ అకాడమీ విద్యార్థులు పలువు నీట్‌లో ర్యాంకులు సాధించారు. వివిధ కేటగిరీల్లో అరవింద్‌నాయక్ రాష్ట్ర స్థాయి 4వ ర్యాంకు, అలేఖ్య స్టేట్ 17వ ర్యాంకు సాధించారని డైరెక్టర్లు రాయల సతీష్‌బాబు, భరణికుమార్ తెలిపారు. అలాగే, ఏపీ రాష్ట్ర స్థాయిలో అరవింద్ నాయక్ 7వ ర్యాంకు, అయూబ్ 19వ ర్యాంకు సాధించారని పేర్కొన్నారు. ఇంకా 100, 209, 371, 409, 512, 618 ర్యాంకులను వరుసగా అరవింద్, అలేఖ్య, శ్రీవిద్య, జాస్మిత, శ్రీవిద్య, కల్యాణ్ సాధించగా, 600పైగా మార్కులు ముగ్గురు, 550కి పైగా మార్కులు 9మందితో పాటు 500 మార్కులకు పైగా 30 మంది, 400 మార్కులకు పైగా మార్కులను 103 మంది సాధించారని డైరెక్టర్లు తెలిపారు.



విద్యార్థులతో డైరెక్టర్లు సతీష్‌బాబు, భరణికుమార్

● శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య

నీట్ రాష్ట్రస్థాయి ర్యాంకులు సోమవారం ప్రకటించగా తమ విద్యార్థులు పలువురు మెరుగైన ర్యాంకులు సాధించారని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం వారు విద్యార్థులను అభినందించి మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో 47 నుంచి 1000లోపు ర్యాంకులు 52 మంది సాధించారని తెలిపారు. ఇందులో కె.లీలా శ్రీధర్ 47వ ర్యాంక్, బి.జశ్వంత్‌కుమార్ 109, జి.వరుణ్ రోహన్ 161, కె.జన్వతదేవి 166, వి.శ్రావ్య 315, టి.శ్రీతేజ 334, ఆర్.అక్షయ 395, సీహెచ్.సహస్ర 451, బి.అక్షిత 792, ఎస్.చరితరెడ్డి 926వ ర్యాంక్ సాధించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్లు బి.సాయిగీతిక, డీజీఎం సీహెచ్.చేతన్ మాథూర్, అకడమిక్ డీన్ ఎస్ఆర్ఎస్‌డీ.వర్మ, ఏజీఎంలు సీహెచ్.బ్రహ్మం, జి.ప్రకాష్, గోపాలకృష్ణతోపాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

● ‘రెజొనెన్స్’ విజయభేరి

నీట్ రాష్ట్రస్థాయిలో తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించి అగ్రగామిగా నిలిచారని రెజొనెన్స్ కళాశాలల డైరెక్టర్లు ఆర్.వీ. నాగేంద్రకుమార్, కె.శ్రీధర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించాక వారు మాట్లాడారు. తమ కళాశాల విద్యార్థి నాజియా అంజుమ్ 1,125వ ర్యాంక్, సానియా 1,910, ఎస్.దేవిక 1,958, ప్రణతి 3,163, ఆనంద్ 3,759వ ర్యాంక్ సాధించారన్నారు. వీరితో పాటు అనేక మంది విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు సతీష్, ఎం.భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న డైరెక్టర్లు నాగేంద్రకుమార్, శ్రీధర్‌రావు

బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలు వీరే..

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–13, 15, 17, 19 బాలబాలికల విజేతల వివరాలను అసోసియేషన్ కార్యదర్శి ఎస్.ఉప్పల్‌రెడ్డి సోమవారం వెల్లడించారు. అండర్–13 బాలుర సింగిల్స్‌లో వి.మేఘవర్షిత్, ఎస్.హర్షిత ప్రణీత్, డబుల్స్‌లో మేఘా వర్షిత్ – శ్రీహర్ష ప్రణీత్, డి.కార్తికేయ – కె.విష్ణు తేజ, బాలికల సింగిల్స్‌లో వై.హన్షిత, జి.నిషితసంతోషి, డబుల్స్‌లో జె.అన్విత – పి.శ్రీదేవి, ఎం.చరితశ్రీ – నిత్య సంతోషి వరుసగా మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. అలాగే, అండర్–15 బాలుర సింగిల్స్‌లో తేజస్ వివేక్, నిఖిల్, డబుల్స్‌లో నిఖిల్ – వినయ్, విద్యాధర్ – విశ్వతేజస్, బాలికల సింగిల్స్‌లో నందిత, అవంతిక, డబుల్స్‌లో నందిత – హన్షిత, నిషిత సంతోషి – అక్షిత, అండర్–17 బాలుర సింగిల్స్‌లో భవ్యస్, వినుదయ్, డబుల్స్‌లో వినుదయ్ – యు.వినిల్, కెభవ్యస్ – తేజస్ వివేక్, బాలికల సింగిల్స్‌లో వి.వేదస్వి, నందిత, అండర్–19 బాలుర సింగిల్స్‌లో కె.భవ్యస్, యశత్‌రెడ్డి ప్రథమ, ద్వితీయస్థానాల్లో నిలవగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు కాటమనేని రమేష్, కర్నాటి వీరభద్రం, పి.యుగంధర్, నల్లమోతు రఘు, చంద్రశేఖర్, మల్లికార్జున్, రామారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పోటీల్లో విజేతలతో నిర్వాహకులు

స్వగ్రామంలో ‘నైటింగేల్’కు సన్మానం



సుశీల దంపతులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు

రఘునాథపాలెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏఎన్ఎంగా విధులు నిర్వర్తిస్తున్న రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంకు చెందిన తేజావత్ సుశీల ఇటీవల రాష్ట్రపతి చేతుల మీదుగా ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా ఆమెకు సోమవారం వీ.వీ.పాలెం పాఠశాలలో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్ రావెళ్ల మాధవి, ఎంపీటీసీలు యరగర్ల హన్మంతరావు, భద్రమ్మతోపాటు పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ పోతగాని నాగరాజు, హెచ్ఎం శ్రీదేవి, కిలారు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను కొట్టిన హాస్టల్ సిబ్బంది

కామాటిని చితకబాదిన తల్లిదండ్రులు

నేలకొండపల్లి: వసతి గృహాలకు రెగ్యులర్ సంక్షేమాధికారి లేకపోవటంతో సిబ్బందే పెత్తనం చెలాయిస్తుండడం సాధారణమైపోయింది. అయితే, ఇది కాస్త శృతిమించి విద్యార్థులపై చేయి చేసుకునే వరకు వెళ్లగా.. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు సోమవారం చేరుకుని కామాటి(సిబ్బంది)ని చితకబాదారు. వివరాలు... నేలకొండపల్లి మండలం చెరువుమాధారం ఎస్సీ బాలుర వసతి గృహాన్ని రెగ్యులర్ వార్డెన్ లేకపోవటంతో నేలకొండపల్లి వార్డెన్ బాలకృష్ణకు బాధ్యతలు అప్పగించారు. ఫలితంగా అక్కడ కామాటి సత్యానందందే పెత్తనం సాగుతుండగా, రెండు రోజుల క్రితం ఆరుగురు విద్యార్థులను వాతలు తేలాలా కొట్టాడు. దీంతో విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు సోమవారం హాస్టల్‌కు వచ్చి ఇదేమిటని ప్రశ్నిస్తే వారిపైనా మండిపడ్డాడు. దీంతో సర్పంచ్ ఈవూరి సుజాత, ఉప సర్పంచ్ ఆకుల వెంకటేశ్వర్లు, దళిత సంఘాల నాయకులు సూరేపల్లి శ్రీను, సూరేపల్లి రవి చేరుకుని విద్యార్థులతో మాట్లాడగా పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నారని, మెనూ అమలుచేయడం లేదని విద్యార్థులు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు సత్యానందంపై దాడి చేశాడు. ఈక్రమంలో స్థానికులు అడ్డుకుని తప్పు చేస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలే తప్ప దాడి చేయొద్దని సూచించగా.. ప్రజాప్రతినిధులు సర్దిచెప్పడంతో వివాదం సదుదమణింది.



కామాటి సత్యానందంపై దాడిచేస్తున్న తల్లిదండ్రులు

డివైడర్‌ను ఢీకొట్టిన బైక్.. ఒకరి మృతి

సూర్యాపేట రూరల్: సూర్యాపేట పట్టణ పరిధిలోని పిల్లలమర్రి స్టేజీ వద్ద జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఖమ్మం జిల్లా కూసుమంచికి చెందిన కుక్కంటి గోపాలకృష్ణ(30) హైదరాబాద్‌లోని అపోలో హాస్పిటల్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఆయన కూసుమంచి నుంచి హైదరాబాద్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పిల్లలమర్రి గ్రామ స్టేజీ వద్ద డివైడర్‌కు ఢీకొట్టాడు. ఈ ఘటనలో గోపాలకృష్ణ తలకు బలమైన గాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందగా, ఆయన తండ్రి రామ్మోహన్‌రావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సూర్యాపేట రూరల్ ఎస్సై సాయిరాం తెలిపారు.

పోడు సాగుదారులపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వం

- సక్రమంగా జరగని సర్వే.. పాస్‌బుక్‌కు వసూళ్లు
- ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మంమయూరిసెంటర్: పోడు సాగుదారులకు పట్టాలు పంపిణీ చేయడాన్ని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా స్వాగతిస్తున్నా... పోడు సాగుదారుల గుర్తింపు, అర్హులకు పట్టాల పంపిణీలో మాత్రం ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేస్తోందని విమర్శించారు. అన్నిచోట్ల పూర్తి స్థాయిలో సర్వే చేయకపోగా, చేసిన చోట్ల కూడా మూడు, నాలుగెకరాలకు బదులు ఎకరానికే పట్టా ఇస్తున్నారని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో 13 వేల మంది పోడు సాగుదారులకు గాను ఆరు వేల మందికే పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారన్నారు. ఇక పట్టాల పేరిట పోడు సాగుదారుల నుంచి బీఆర్ఎస్ నాయకులతో పాటు ఐటీడీఏ, అటవీ శాఖ అధికారులు డబ్బు వసూలు చేస్తున్నారని రంగారావు ఆరోపించారు. కాగా, కాంగ్రెస్ బహిరంగ సభను అడ్డుకోవడం అప్రజాస్వామికమని, తెలంగాణ ఏర్పాటుకు సహకరించిన పార్టీకి ఇలాంటి పరిస్థితి రావటం మంచిది కాదన్నారు. ఈ సమావేశంలో ప్రజాపంథా జిల్లా ప్రధాన కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, నాయకులు చంద్ర అరుణ, గుర్రం అచ్చయ్య, కె.అర్జున్‌రావు, సీ.వై.పుల్లయ్య, ఆవుల అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రంగారావు, పక్కన నాయకులు

పోడు రైతుల కల సాకారం చేసింది మేమే...

- స్క్రిప్ట్ ఆధారంగానే రాహుల్ విమర్శలు
- వైరా ఎమ్మెల్యే రాములునాయక్

కారేపల్లి: ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీకు పరిపక్వత లేక ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ ఆధారంగా సీఎం కేసీఆర్‌ను విమర్శించారని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ పేర్కొన్నారు. కారేపల్లిలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన అదనపు కలెక్టర్ స్నేహలతతో కలిసి పోడు రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాములునాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు పూర్తిస్థాయిలో పోడు పట్టాలు ఎందుకు ఇవ్వలేదో చెప్పాలన్నారు. తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ నేతృత్వాన గిరిజన పోడుదారుల గోడు చూడలేక అందరికీ పట్టాలు ఇస్తున్నారని తెలిపారు. తద్వారా పోడురైతుల కల నిజం కాగా, మూడో సారి సీఎం కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధమవుతున్నారని చెప్పారు. సింగరేణి మండలంలో 2,101 మంది పోడురైతులకు 5,070 ఎకరాల భూమికి సంబంధించి పట్టాలు అందజేశామని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ స్నేహలత మాట్లాడుతూ సింగరేణి మండలంలో పోడు భూమి సర్వే సజావుగా చేపట్టిన ఎంపీడీఓ చంద్రశేఖర్‌ను అభినందించారు. అలాగే, సర్వేకు గ్రామ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, ఫారెస్టు, ఎఫ్ఆర్‌సీ కమిటీ చైర్మన్లు సహకరించారని చెపాపరు. ఎంపీపీ మాలోతు శకుంతల, జెడ్పీటీసీ వాంకుడోతు జగన్ నాయక్, తహసీల్దార్ తూమటి శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దబోయిన ఉమాశంకర్‌తో పాటు రావూరి శ్రీనివాసరావు, అడ్డగోడ ఐలయ్య, దుగ్గినేని శ్రీనివాసరావు, పద్మావతి, ముత్యాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కారేపల్లిలో పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే రాములు నాయక్, అదనపు కలెక్టర్ స్నేహలత

పోడు సమస్య తీర్చిన సీఎం కేసీఆర్

ఏన్కూరు: పోడు భూములు సాగు చేస్తున్న రైతుల సమస్యను తీర్చిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ తెలిపారు. స్థానిక రైతువేదికలో సోమవారం పోడు రైతులకు పట్టాల పంపిణీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏళ్లుగా కష్టాలను ఎదుర్కొంటున్న పోడు రైతులకు పట్టాలు ఇవ్వడం ద్వారా వారు ధైర్యంగా సాగు చేసుకుంటారని తెలపారు. ఎంపీపీ అరెం వరలక్ష్మి, జెడ్పీటీసీ బాదావత్ బుజ్జి, ఎంపీడీఓ బయ్యారపు అశోక్, నాయకులు బానోతు సురేష్‌నాయక్, భూక్యా లాలు, బాలాజీ పాల్గొన్నారు.

భూవివాదంపై కేసు నమోదు

చింతకాని: మండలంలోని అనంతసాగర్‌లో భూవివాదానికి సంబంధించి కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దొడ్డా చిన్న యలమందయ్యకు చెందిన వ్యవసాయ భూమి హద్దురాళ్లను నాగయ్య ధ్వంసం చేశాడు. ఈ విషయమై ప్రశ్నిస్తే దూషించడంతో పాటు కొట్టాడు. దీంతో యలమందయ్య ఫిర్యాదు మేరకు నాగయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.

బస్సులో తరలిస్తున్న గంజాయి స్వాధీనం

వైరా: ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం డంపింగ్ లైన్ ప్రాంతానికి చెందిన చేతన్ గులరీ, గౌరీ జారా ఒడిశా నుంచి భద్రాచలం మీదుగా హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సులో గంజాయి తరలిస్తున్నారు. ఈ విషయమై అందిన సమాచారంతో వైరా బస్టాండ్‌లో సోమవారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సర్వేశ్వరరావు, ఎస్ఐ షేక్ ముబారక్ అహ్మద్ తనిఖీ చేయగా 12.5 కిలోల ఎండు గంజాయి లభించింది. దీంతో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎక్సైజ్ అధికారులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

మధిర: మండలంలోని ఆత్కూరు సమీపాన సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం కొండూరుకు చెందిన బత్తుల ఆంజనేయులు మోటార్‌సైకిల్‌పై ఖాజీపురం నుంచి మధిరకు వెళ్తున్నాడు. ఈక్రమంలో మధిర నుంచి ఖాజీపురం వైపు వెళ్తున్న కారు ఆత్కూరు వద్ద ఢీకొనడంతో కింద పడిన ఆంజనేయులకు గాయాలయ్యాయి. దీంతో ఆదరణ ఫౌండేషన్ నిర్వాహకురాలు నిస్సి హరిణి మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స అనంతరం వైద్యులు విజయవాడ తీసుకెళ్లారు.

గొడవ పడిన తండ్రీకొడుకులు

ఆపలేక మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

ఖమ్మంక్రైం: కళ్లముందే భర్త, కుమారుడు గొడవ పడడం చూసిన ఆమె అడ్డుకోబోతే నెట్టేయడంతో మనస్థాపానికి గురైన వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఖమ్మం రాపర్తినగర్‌కు చెందిన పడాల బసవయ్య తన కుమారుడు సాయిలక్ష్మణ్ ఏ పని చేయడం లేదని మందలించాడు. దీంతో సాయి తన తండ్రి బసవయ్యతో ఘర్షణకు దిగాడు. ఇద్దరి మధ్య వాదన పెరిగి కొట్టుకుంటుండడంతో బసవయ్య భార్య శ్రీవాణి(37) ఇద్దరిని విడదీయడానికి ప్రయత్నించింది. అయినా వారు వినకుండా ఆమెను నెట్టేశారు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె గదిలోకి వెళ్లి గడియ పెట్టుకుని ఉరి వేసుకుంది. కళ్ల ముందే వాణి ఉరి వేసుకుంటుండగా వారించిన భర్త, కుమారుడు చివరకు తలుపు పగులకొట్టి వెళ్లేసరికి ఆమె మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం టు టౌన్ సీఐ శ్రీధర్ తెలిపారు.

గర్భిణి కడుపులో శిశువు మృతి

- ఆపరేషన్ చేసి తీసిన వైద్యులు
- పెద్దాస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణమని ఆరోపణ



మృత శిశువుతో రోదిస్తున్న బంధువులు

ఖమ్మం వైద్యవిభాగం: ఇరవై ఏళ్ల తర్వాత పండంటి బిడ్డ పుడుతుందని కలలు కన్న ఆ తల్లిదండ్రుల ఆశ తీరలేదు. కడుపులోనే శిశువు మృత్యువాత పడగా.. పెద్దాస్పత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ ఆందోళన చేశారు. వివరాలు... నేలకొండపల్లి మండలం చెరువుమాదారానికి చెందిన సురపెల్లి లక్ష్మి – కోటయ్యకు ఇరవై ఏళ్ల క్రితం వివాహం జరగగా ఇన్నాళ్లకు లక్ష్మి గర్భం దాల్చింది. ఈమేరకు నెలలు నిండగా కుటుంబ సభ్యులు ఖమ్మం పెద్దాస్పత్రిలోని ఎంసీహెచ్‌కు శనివారం రాత్రి తీసుకువచ్చారు. ఇక్కడ పరీక్షించిన వైద్యులు ఆమెను చేర్చుకుని సాధారణ ప్రసవం కోసం ప్రయత్నించారు. ఆ ప్రయత్నమే లక్ష్మి దంపతుల పాలిట శాపమైంది. ప్రభుత్వం సాధారణ ప్రసవాలను ప్రోత్సహిస్తుండడంతో వైద్యులు, సిబ్బంది ఆ దిశగా కృషి చేయగా.. లక్ష్మి కడుపులోనే శిశువు సోమవారం మృతి చెందింది. ఈమేరకు విషయాన్ని వారికి చెప్పి లక్ష్మి ఆపరేషన్ చేసి మృతశిశువును బయటకు తీశారు. అయితే, ముందు శస్త్రచికిత్స చేస్తే బిడ్డ బతికేవాడని, సాధారణ డెలివరీ పేరిట కాలయాపన చేయడంతో ఇలా జరిగిందని లక్ష్మి తల్లి రూథమ్మ కన్నీరు మున్నీరుగా విలపించింది. ఈమేరకు నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆమెతో పాటు బంధువులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఆర్ఎంఓ బి.శ్రీనివాసరావును వివరణ కోరగా కడుపులో శిశువు మృతి చెందిన మాట వాస్తవమేనన్నారు. ఇందులో సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు.